

ఏజెన్సీలో హొయలొలికే వాటర్‌ఫాల్స్




అన్నవరం



నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎన్నెన్నో.. అందాలు



పాపికొండల విహారం



సముద్రతీర ప్రాంతం



అందంగా తూర్పు ఏజెన్సీ

గోదావరి జిల్లాలు.. ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్. అడుగడుగునా ఓ ప్రత్యేకత. ఆకుపచ్చని లోకంలో విహరించాలంటే ఖచ్చితంగా ఇక్కడకు రావాల్సిందే. ప్రకృతి రమణీయతకు అద్దంలా కనిపించే పచ్చని పైరు పంటలు.. కోనసీమ కొబ్బరి తోటల అందాలు ఎవరినైనా ఈ కొత్త లోకంలో విహరింపజేస్తాయి. ఇక పేరులోనే ఉన్న గోదావరి.. పరవళ్లు తొక్కే గోదావరికి ఆనుకుని పరుగులు పెట్టే పంట కాల్వలు, మరోవైపు దట్టమైన అడవి.. అందులో ఎగిసిపడే వాగులు..వంకలూ.. మరోవైపు పాపికొండల వయ్యారాలు..ఇటు చూస్తే అంతమే లేదన్నట్టు సాగిపోయే తీరంలో సముద్రపు అలల సవ్వడి.. ఇంకా కడియం పూలతోటలు.. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే ఆలయాలు.. అన్నిటికీ మించి అన్నవరం దేవా లయం. పర్యాటకం అంటే ఊటీకో, గోవాకో వెళ్లడం కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రండి.. చూస్తే పరవశించిపోవాల్సిందే..

- కాకినాడ/ రాజమహేంద్రవరం/ అమలాపురం (ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఊటీ..కొడైకెనాల్‌ను తలదన్నే పర్యాటక ప్రాంతాలు

ఓ వైపు కొబ్బరి చెట్లతో తివాచీ పరిచినట్టు పచ్చగా కనిపించే కోనసీమ.. ఇంకో వైపు గోదావరి నడుమ పాపి కొండల వయ్యారాలు.. మరో వైపు మారేడుమిల్లి అటవీ అందాలు.. ఇంకోపక్క కాకినాడ సమీపంలో కోరింగ అభ యారణ్యం.. ఇలా చెప్పుకుంటూపోతే ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువేలేదు. కోరు కొండ, ఆదుర్రు, కొడవలిలో బౌద్ధ స్థూపాలు, పెద్దాపు రంలో పాండవులమెట్ట వంటి చారిత్రక ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఇక అన్నవరం, అప్పనపల్లి, అంతర్వేది, అయి నవిల్లి, మురమళ్ల, ముక్తేశ్వరం, వాడపల్లి, కోటిపల్లి, ర్యా లీ, ద్రాక్షారామ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో చారిత్రక దేవాలయాలూ ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాల పరి ధిలో విస్తరించి ఉన్న పాపికొండల విహారం ఆహ్లాదభరి తం. ఎత్తయిన కొండలు, అటవీప్రాంతం మీదుగా వం పులు తిరుగుతూ ప్రవహించే గోదావరి అందాలను బోటులో నుంచి వీక్షించవచ్చు. గోదావరి తీరంలో ఉన్న చారిత్రక నగరం రాజమహేంద్రవరం. గోదావరి గట్టున ఉన్న రాళ్లబండి మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం ఇల్లు, పెద్ద మసీదు వంటివి చూడ దగ్గవి. గోదావరి తీరంలో గౌతమిఘా ట్‌ను ఆనుకుని టెంపుల్ స్ట్రీట్‌లో ఇస్కాన్ తదితర ఆలయాలు ఉన్నా యి. రాజమహేంద్రవరం అఖండ గోదావరిలో బోట్ షికారు నిర్వహిస్తున్నా సరైన నిర్వహణ లేక దానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. పుష్కర ఘాట్‌లో నిత్య హారతి కార్యక్రమం వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కింది. రాజమహేంద్రవరానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధవళేశ్వరంలో 1852లో కాటన్ మహాశయుడు నిర్మించిన బ్యారేజీ తప్పక చూడాల్సిందే. రూపాయి ఖరీదు చేసే మొక్క నుంచి లక్షల విలువ చేసే దేశ, విదేశీ రకాల మొక్కలూ కడియం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన 600 నర్సరీల్లో కనిపిస్తాయి. వశిష్ఠ పాయ ఒడ్డున కోనసీమలో కొలువుదీరిన దిండి దశాబ్దకాలంలో పర్యాటకంగా బాగా ప్రాచుర్యం పొందింది. హరిత కోకో నట్ కంట్రీ రిసార్ట్స్ పేరుతో ఏపీ టూరిజం ఇక్కడ రిసా ర్ట్స్ నిర్వహిస్తోంది. దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్ బోట్లు ద్వారా నదీవిహారాలు సాగిస్తుంటారు. దిండి రిసా ర్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి గదులతో పాటు నాలుగు హౌస్‌బోట్లు, ఒక వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. దిండిలో టూరిజం రిసా ర్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశ ర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ ప ర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఆదుర్రులో బౌద్ధస్థూపం చరిత్రకెక్కింది. కాట్రేనికోన మండలం కంది కుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవు ల్లో పడవల ద్వారా విహారయాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధి చెందిన ఓడలరేవు, కొమ రగిరిపట్నం, కేశనపల్లి, కేశవ దాసుపాలెం,అంతర్వేది, ఎస్.యానాం, చిర్రయానం బీచ్‌లు వేలాదిమందితో కళకళలాడుతున్నాయి. కోనసీమలో అంతర్వేది లక్ష్మీనర సింహస్వామి, గౌతమీనది చెంతన అయినవిల్లి సిద్ధి వినాయక, క్షణముక్తేశ్వరస్వామి, మురమళ్ళ వీరేశ్వర స్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, కడలిలో కపోతేశ్వర స్వామి, వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి, మందపల్లిలో శనేశ్వరస్వామి, ర్యాలిలో జగన్మోహినీ ఆలయాలు ఉమ్మ డి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి.

ఏజెన్సీ అందాలకు వెలుగేది..

చూపుతిప్పుకోలేని ప్రకృతి అందాలు తూర్పు ఏజెన్సీ సొంతం. మారేడుమిల్లి సమీపంలో అటవీశాఖ ఎకో టూ రిజం ప్రాజెక్టు నిర్వహిస్తోంది. వనవిహారి పేరుతో మారే డుమిల్లిలో రిసార్ట్స్‌లో వసతి ఏర్పాట్లు కల్పించారు. ఈ రిసార్ట్స్‌లో స్టే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకో వాలి. ఎకో టూరిజంలో ప్రధానమైన పర్యాటక ప్రాంతం జంగిల్ స్టార్. ఇది పాములేరు వాగు పక్కనే ఉంది. పాములేరు బ్రిడ్జి నుంచి కిలోమీటరున్నర దూరం ఉం టుంది. జంగిల్ స్టార్ నేచురల్ క్యాంపులో గడిపాలను కునే వారికి ఒక రాత్రంతా అడవిలో గడిపిన అనుభూతి కలుగుతుంది. కొంతకాలంగా గుడిసె అందాలను ఆస్వా దించడానికి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. వెదు రుబొంగులలో పెట్టి తయారుచేసిన బొంగు చికెన్, బొంగు బిర్యాని ఇక్కడ స్పెషల్. మారేడుమిల్లికి 6 కిలో మీటర్ల దూరంలో జలతరంగిణి, కాఫీ తోటలు పర్యాట కులకు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇటు రంపచోడవరానికి 6 కిలోమీటర్ల దూరంలో రంప ఉంది. ఇక్కడ 14వ శతా బ్దంలో నిర్మించిన శివాలయం ప్రాశస్త్యం పొందింది. శివా లయానికి కిలోమీటరు కొండపైకి వెళితే జలపాతం ఆక ట్టుకుంటోంది. ఇన్ని అందాలున్నా వాటి అభివృద్ధికి మా త్రం ఎలాంటి చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యాటకరంగా నికి మరింత శోభ చేకూరుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడేలా చేయడానికి రం గం సిద్ధమవుతోంది. హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు నుంచి మడ అడవుల వరకు అభివృద్ధి చేయడానికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి.

రూ.100 కోట్లతో అఖండ గోదావరి

కూటమి ప్రభుత్వం తాజాగా పర్యాటక రంగంపై దృష్టిపెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్త పర్యా టక పాలసీని తీసుకొని రావడానికి కసరత్తు చేస్తోంది. గోదావరి జిల్లాల్లో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ జిల్లాకు చెందినవారే కావడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందు తుందనే ఆశలు చిగురించాయి.అఖండ గోదా వరి కి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆయన స్పష్టం చేసి న సంగతి తెలిసిందే. ఇప్పటికే కడియం నర్సరీలను పర్యాట కంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్కడ కాలువ లో బోట్ షికారు పెట్టనున్నా రు. పాపి కొండలు ఇప్పటికే బోట్ షికారుతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే.

- పర్యాటకానికి చిరునామా 'తూర్పు'
- గోదారి పరవళ్లు.. పచ్చని కోనసీమ
- అపార బీచ్‌లు.. ఏజెన్సీ అందాలు
- ఆధ్యాత్మికత.. పూల సోయగాలు
- కూటమి దృష్టిపెడితే..ఆదాయవనరు
- పట్టించుకుంటే ఇదే స్వర్గసీమ
- నిధుల లేమితో ప్రాజెక్టులు మూలకు
- పర్యాటకంగా కానరాని అభివృద్ధి
- తాజాగా రూ.100 కోట్లతో ప్రాజెక్టు



మడ అడవులు

మడ అడవులు చూస్తే..మరువరు

దేశంలో పశ్చిమబెంగాల్ తర్వాత రెండో అతిపెద్ద మడ అడవులు కాకినాడలోనే ఉన్నాయి. వేల ఏళ్ల నాటి ఈ మడ అడవులు కాకినాడ నగరానికి రక్షణ గోడగా నిలు స్తున్నాయి. సునామీలు, వరదలు, తుఫాన్ల నుంచి కాకి నాడతో పాటు కోనసీమలో ఎన్నో ప్రాంతాలను రక్షిస్తు న్నాయి. నదీ జలాలు సముద్రంలో కలిసే చోట చిత్తడినే లల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీ టిలో చెట్లు పెరగవు. కానీ ఇవి అందులోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు, పొదల సముదాయమే మడ అడవులు. తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. నది.. సముద్రంలో కలిసే ప్రదేశంలో సహజసిద్ధంగా పుట్టుకువచ్చే ఈ మడఅడవులు ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయా రణ్యంగా కేంద్రం గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తిం చారు. ఇందులో కోరంగి అభ యారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కి.మీలో విస్తరించి ఉంది.వీటిలో 80 రకాల వృక్షజాతులున్నాయి.అతిపెద్దదైన కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతు ల మడ మొక్కలున్నాయి. ఇక్కడకు ఏటా 120 జా తుల పక్షులు వచ్చి విడిది చేస్తుంటాయి. ఎంతో మంది పర్యాటకులు వస్తున్నా సరైన సదుపాయాలే లేవు.

అందాలున్నా..ఆదరించలేదు..

ఓ వైపు సువిశాల సముద్ర తీరం..మరోవైపు జలజల పారే నదీ జలాలు..ఈరెండింటి మధ్య పొదలుగా...గు బురుగా.. సూర్యుడి వెలుతురు కూడా చొరబడనంత దట్టం గా విస్తరించిన మడ అడవులు.. కాకి నాడ కాజా..ఎన్టీఆర్ బీచ్..కుంభాభిషేకం.. అన్నవరం, పాద గయ..ఉప్పాడ బీచ్..ఉప్పాడ చీరలు.. పెరుమాళ్లపు రం పాకంగారెలు.. చిట్టి ముత్యాల బిర్యానీ.. చిట్టిపెస రట్టు..ఇలా ఒకటేంటి కాకినాడ అంటే పర్యా టకులకు ఇలా చాలానే గుర్తొచ్చేవి.. పర్యాటకులను ఆక ర్షించే అవకాశం ఉన్నా గత వైసీపీ ప్రభు త్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసింది.పైసా నిధులు కూడా విదల్చకుం డా పర్యాటక రంగానికి తూట్లు పొడిచింది. గడచిన ఐదేళ్లలో పర్యాటక రంగం పడకేసింది. వాస్తవానికి 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో పర్యా టక రంగానికి భారీ ఊపుతెచ్చింది. కాకి నాడ నుంచి ఉప్పాడ వరకు ఉన్న బీచ్‌రోడ్డును అభివృద్ధి చేసి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించింది.ఎన్టీఆర్ బీచ్‌ను అభివృద్ధి చేసి పర్యాటక ఉత్సవాలు, రోజుల తరబడి బీచ్ ఫెస్టివల్‌ను నిర్మించింది.వైసీపీ వచ్చాక వీటన్నిం టికి మంగళం పాడేసింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పర్యాటక అభి వృద్ధిపై దృష్టి సారించింది. పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ ఇప్పటికే సీఎం వద్ద పలు ప్రతిపాదనలు ఉంచారు. కాకినాడ జిల్లాలో అన్నవరం,పాదగయ, సామర్లకోట భీమేశ్వర ఆల యం.. ఉప్పాడ బీచ్ కలిపి టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేయాలని కూటమి ప్రభు త్వం ఆలోచిస్తోంది. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ ఈ దిశగా హామీ కూడా ఇవ్వడంతో దీని అమలుపై కార్యాచరణ ప్రణాళికలు రచిస్తున్నారు.

వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీ..



వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీని తీసుకుని రానున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ వచ్చే మార్చి వరకూ అమలులో ఉంటుంది. మార్చి తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తు న్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టుతో రాజమహేంద్ర వరం అఖండ గోదావరి, కడియం, హేవలాక్, చారిత్రిక కట్టడాలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా లోని ప్రాంతాలు, పశ్చిమగోదావరి జిల్లాలో పేరుపాలెం బీచ్ వంటివన్నీ అభివృద్ధి చేస్తాం. - **కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి**



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సైబర్ నేరాలు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

కాకినాడ క్రైం, సెప్టెంబరు26: ఆర్థిక నేరాలు, సైబర్ నేరాల జరక్కుండా అరి కట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదే శించారు. గురువారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికా రులతో నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టా లన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. మహిళల భద్ర త, రక్షణ కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి సందర్భంగా బాణ సంచా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని బాణసంచా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. చోరీల నియంత్ర ణ, రికవరీపై చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకుంటే ఏమాత్రం ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పలు అంశాలపై సమీక్ష నిర్వహిం చి సూచనలు చేశారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల విభజనపై డీలర్ల ఆందోళన

కార్డుల విభజన తమకు నష్టమంటున్న రేషన్ డీలర్లు
వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో నష్టం
ఇప్పుడు కార్డుల విభజనతో నష్టమని ఆవేదన
తమ అభ్యర్థనలనూ పరిశీలించాలని వినతి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26: రేషన్ కార్డులను విభజించి కొత్తగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల సంఖ్యను పెంచడం వల్ల తాము తీవ్రంగా నష్ట పోతున్నామని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డుల కేటా యింపు సంఖ్యను తగ్గించడంతో కమీషన్ తగ్గి డిపోలను నిర్వహించలేమని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 1060 ప్రభుత్వ చౌకధరల దుకాణాలు ఉండగా, ఆయా దుకాణాల్లో వెయ్యి నుంచి 1500 వరకు రేషన్‌కా ర్డులు కలిగి ఉన్నాయి. రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రప్రభుత్వం తాజాగా కార్డుల విభజనకు శ్రీకారం చుట్టింది. దీనివల్ల జిల్లాలో 170 వరకు కొత్త రేషన్ దుకా ణాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మండలాల్లో తహశీల్దార్లు విభజన ప్రక్రియ ఆరంభించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో 400 కార్డులు ఉండేలా విభజన చేస్తున్నారు. పట్టణాల్లో 600 రేషన్‌కార్డులు, కార్పొరేషన్ పరిధిలో ఒక్కొక్క దుకాణానికి 800 రేషన్ కార్డులుండే విధంగా విభజన చేస్తున్నారు. అయితే దీనివల్ల కమీషన్ తగ్గిపో తుందని రేషన్ డీలర్లు తహశీల్దార్ కార్యాలయాల్లో అధికారులతో వాదనకు దిగుతున్నారు. దీంతో రేషన్‌కార్డుల విభజన అధికారులకు తలనొప్పిగా మారిం ది. గ్రామాల్లో ఒక్కొక్క దుకాణానికి 400 రేషన్‌కార్డులు కేటాయిస్తే కమీషన్ రూ.5,600 వరకు మాత్రమే వస్తుందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. పట్ట ణాల్లో సైతం 600 కార్డులు కేటాయిస్తే నెలకు రూ.10 వేలు వస్తుందని, దీంతో అద్దెలు చెల్లించి కుటుంబాన్ని ఎలా పోషించాలని రేషన్ డీలర్లు వాపోతున్నా రు. వైసీపీ ప్రభుత్వం హయంలో ఎండీయూ వాహనాలలో రేషన్ వ్యవస్థ నిర్వీర్యం అయిందనీ, ఇప్పుడు రేషన్ కార్డుల విభజనతో నష్టం జరుగుతుందని డీలర్లు అంటున్నారు. కాగా 130 దుకాణాలను తాత్కాలిక ప్రాతిపదికన డీలర్లు నిర్వహిస్తున్నారు. అయితే కొత్త వారిని నియమించాలనే లక్ష్యంతో వీటికి నోటి ఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎవరైతే పదేళ్ల నుంచి దీన్ని నమ్ముకుని జీవిస్తున్నారో వారికే ఇవ్వాలని డీలర్లు డిమాండు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లయ్య మాట్లా డుతూ రేషన్‌కార్డుల విభజన వల్ల తాము నష్టపోతున్నామని జేసీ రాహుల్ మీనాను కలిసి విన్నవించుకున్నామని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారని తెలిపారు. గ్రామాల్లో దుకాణానికి 600 కార్డులు, పట్ట ణాల్లో 800 కార్డులు, కార్పొరేషన్‌లో 900 కార్డులు కేటాయించాలని కోరామని చెప్పారు.

పరిహారం జమకు ప్రతిబంధకాలు

ఆధార్-బ్యాంకు ఖాతా అనుసంధానం లేకపోవడం..
కొన్ని ఖాతాలు ఇన్ యాక్టివ్‌లో ఉండడం..
భూముల రీసర్వేలో తప్పులు..
నిధులు విడుదలైనా జమలో తీవ్ర జాప్యం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26: వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం జమ చేయడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. రైతులు ఇచ్చిన బ్యాంకుఖాతాలు కొన్ని ఆధార్‌కు అనుసంధానం కాకపోవడం, మరికొన్ని ఇన్ యాక్టివ్‌గా ఉండడంతో జమకాలేదు. పైగా భూముల రీసర్వేలో తప్పులను సరి దిద్దలేకపోవడంతో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల వల్ల జిల్లా లోని 18 మండలాల్లో 14425 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగింది. దీనిలో వరితోపాటు మినుము, ప్రత్తి, పెసలు, మొక్కజొన్న, రాగులు, చెరుకు పంటలు ఉన్నాయి. 26,612 మంది రైతులకు నష్టం జరగ్గా రూ.36 కోట్లు విడుదల చేయాలని నివేదిక వెళ్లింది. ఈమేరకు రెండు రోజుల కిందట నుంచి అమరా వతి నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమవుతున్నాయి. వరికి ఎక రానికి రూ.10వేల చొప్పున జమవుతోంది. కానీ ఇప్పటివరకు యాభై శాతం రైతులకు మాత్రమే నష్టపరిహారం జమైంది. భూముల రీసర్వేలో తప్పులు, ఒకే ఎల్‌పీఎం నెంబర్ ఇద్దరు, ముగ్గురికి ఇవ్వడం, కొంతమందికి కౌలురైతులకు గుర్తింపుకార్డులు లేకపోవడం వంటి కారణాలు సొమ్ములు జమకావడానికి ప్రతిబంధకాలుగా మారాయి. భూముల రీసర్వేలో తప్పులను సరిదిద్దాలని రైతులు ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా సరిదిద్దిన పాపాన పోలేదు. దీంతో ఇప్పుడు ఆ సమస్యలే ఇబ్బంది అయ్యాయి. దీంతో నష్టపరిహారం జమ కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టం పరిహారం జమ చేసేం దుకు వీలుగా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

3 నుంచి 21 వరకూ ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు

జిల్లాలో నాలుగు కేంద్రాలు.. హాజరుకానున్న 21,471 మంది

కాకినాడ రూరల్, సెప్టెంబరు 26: టెట్-2024కు సంబంధించిన పరీక్షలు ఆన్‌లైన్‌లో అక్టోబరు 3 నుంచి 21 వరకూ జరుగుతాయని, ఈమేరకు కాకినాడ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని ఐయాన్ డిజిటల్ జోన్, సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలోని రెండు కేం ద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 21,471 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వాటికి సంబంధించి నలుగురు విద్యా శాఖాధికారులను, డిపార్టుమెంట్ అధికారులను, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ అధికా రిణి, వికలాంగులకోసం 27 మంది స్క్రయిబ్‌లను నియమించామని తెలిపారు. పరీక్షలు 9.30 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయం త్రం 5 గంటల వరకూ జరుగుతాయని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఫొటో, గుర్తింపుకార్డుతో హాజరుకావాలని డీఈవో సూచించారు. సమాచారం కోసం 7799698462, 9666375814, 9010545547 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మళ్లీ కలవరపెడుతున్న ఏలేరు

- పొంచి ఉన్న వరద భయం
- రైతుల్లో మళ్లీ ఆందోళన
- భారీవర్షాలతో ఇన్‌ఫ్లోస్ పెరిగే అవకాశం



పిఠాపురం- గొల్లప్రోలు వద్ద ఏలేరు కాలువలో పెరిగిన వరద నీటి ప్రవాహం

పిఠాపురం, సెప్టెంబరు 26: ఏలేరు మళ్లీ కలవరపె డుతోంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లోస్ పెరిగి వరదలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. మళ్లీ మిగులు జలాలు విడుదల చేస్తే ముం పు తప్పదేమోనన్న భయం రైతులను వెన్నాడుతోంది. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం మళ్లీ క్రమేపీ పెరు గుతోంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు పడుతుండడం, ఆయకట్టు ప్రాంతంలో మూడు రోజు లుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మళ్లీ వరద ప్ర మాదం పొంచి ఉందన్న సమాచారం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతానికి రిజర్వా యర్ నుంచి సాధారణ స్థాయిలోనే నీరు విడుదల చేస్తున్నప్పటికి ఇన్‌ఫ్లోస్ ఆధారంగా దీన్ని పెంచే అవ కాశాలు కనిపిస్తున్నాయి. మిగులు జలాల విడుదలను పెంచితే గండ్ల నుంచి నీరు పొలాలను ముంచెత్తడం తోపాటు నివాసప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్ర మాదముందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడమే వారి భయానికి కారణం. ఈనెల మొదటి వారంలో ఇలా వర్షాలు పడిన తర్వాతే భారీగా వరద జలాలు విడుదల చేశారని, ఇప్పుడు అలా జరుగుతుందేమోన ని వారు కలవరానికి గురవుతున్నారు. ఏలేరు రిజర్వా యర్ గరిష్ఠ నీటిమట్టం 86.56 మీటర్లుగా, నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి మట్టం 85.60మీటర్లుకాగా, 22.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2,517 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ వస్తున్నాయి. రిజర్వాయర్ నుంచి 2,850 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో 2వేల క్యూసెక్కులు కాలువలకు, మరో 600 క్యూసెక్కులు విద్యుదుత్పత్తికి, 250 క్యూసెక్కులు విశాఖ తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. వారం వ్యవధిలోనే నీటి నిల్వలు ఒక టీఎంసీకిపైగా పెరిగాయి. అక్టోబరు రెండోవారం వరకూ బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వాతా వరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో భారీ వర్షాలు పడితే రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరు తుందని కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి సహా పరీవాహక మండలాల ప్రజలు ఆందోళన చెం దుతున్నారు. ఇప్పుడు నీరు అధికంగా విడుదల చేసే అవకాశం లేదని, వస్తున్న ఇన్‌ఫ్లోస్‌కు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నామని ఏలేరు ఇరిగేషన్ అధికా రులు చెబుతున్నారు. మరోవైపు ఏలేరు ప్రాజెక్టు నుం చి విడుదలవుతున్న మిగులు జలాలతోపాటు స్థాని కంగా కురుస్తున్న వర్షాలతో కాలువలన్నీ నీటితో ఉధృ తంగా ప్రవహిస్తున్నాయి. ఎక్కడిక్కడ పంటపొలాల్లో నిలిచిపోయిన వర్షపునీరు కాలువల్లోకి చేరడం, అటు రిజర్వాయర్ నుంచి నేరుగా జలాలు వస్తున్న నేపథ్యం లో కాలువలు ఎర్రనీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి.

సుద్దగడ్డ పెరిగింది.. జగనన్న కాలనీ రోడ్డు మునిగింది..



గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారిపై ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరద నీరు

గొల్లప్రోలు, సెప్టెంబరు 26: సుద్దగడ్డ వరద పెరుగుతోంది. ఎగువ ప్రాంతాలతోపాటు స్థాని కంగా కురుస్తున్న భారీ వర్షాలతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ) కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. గట్లకు సమాంతరంగా వరద నీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారిపై రెం డున్నర అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, విద్యార్థులు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రత్యామ్నా య రహదారుల ఏర్పాటు కొలిక్కి రాకపోవడంతో ఇదే మార్గాన్ని వారు వినియోగిస్తున్నారు. ఈ ఏడాదిలో రహదారిపైకి వరద నీరు చేరడం ఇది ఐదోసారని కాలనీ వాసులు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నామన్నారు. కాగా వర్షాలు నేపథ్యంలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది.



తుని వద్ద తాండవలో ప్రవహిస్తున్న నీరు

పెరుగుతున్న తాండవ ప్రవాహం

తుని రూరల్, సెప్టెంబరు26: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాండవలో నీటి ప్రవాహం పెరిగింది. ఎగువన కురు స్తున్న వర్షాలకు పెద్దఎత్తున నీరు నదికి చేరడంతో తాండవకు ఎర్రనీరు పోటెత్తింది.

ఫోరెన్సిక్ మెడిసిన్‌లో సాంకేతికతతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి

రంగరాయ వైద్యకళాశాలలో సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ యాన్యువల్ కాన్ఫరెన్స్

- మెయిన్‌లో

కాకినాడ జీజీహెచ్‌లో ముగిసిన
క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: స్త్రీలలో సంభవించే పలు క్యాన్సర్లను నిర్మూలించే లక్ష్యంతో కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి నిర్వహించిన స్ర్కీనింగ్ పరీక్షలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మాట్లాడుతూ 350 మందికి పరీక్షలు నిర్వహించగా వీఐఏ పరీక్షలో 44 కేసులు పాజిటివ్‌గా గుర్తించామన్నారు. వారిలో 43 మందికి చికిత్స అందిస్తుండగా మరొకరిని బయాప్సీ పరీక్ష చేయించుకోవాలని సూచించామన్నారు. వీఐఏ పరీక్ష, కోయాగ్యులేషన్ చికిత్స అందించడంపై స్థానిక వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సులకు అమెరికా నుంచి వచ్చిన వైద్య నిపుణుల బృందం శిక్షణ ఇచ్చిందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. థర్మల్ కోయాగ్యులేషన్ పరికరాన్ని అమెరికా వైద్య నిపుణులు జీజీహెచ్‌కు వితరణ చేశారు. శిబిరం విజయవంతమైన సందర్భంగా అమెరికా వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఐఎస్‌సీసీ అధ్యక్షుడు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల, అమెరికన్ కాలేజ్ ప్రసూతి, గైనకాలజిస్టులు డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హాబాచ్, జీజీహెచ్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి, డాక్టర్ లక్ష్మీకిరణ్, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

ఎంపీహెచ్‌ఏలకు నియామక
ఉత్తర్వులు అందజేత

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 186 మంది ఎంపీహెచ్‌ఏ(ఎం)-2002 అభ్యర్థులకు కండిషనల్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీహెచ్‌ఏ (ఎం) అభ్యర్థులు కొంతమంది కోర్టుకి కంటెస్ట్ చేయగా.... కోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతలను పరిశీలించారు. విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 86 మంది సీసీలకు గాను 185 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ ద్వారా కండిషనల్ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు అందించారు.

కొండ చిలువ హతం



కిర్లంపూడి, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురంలో పది అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. ఇటీవల ఏలేరు వరదల్లో కొండ చిలువలు కొట్టుకొచ్చాయని గ్రామస్తులు తెలిపారు. గత ఆదివారం ఏలేరు కాలువలో కొండచిలువ కొట్టుమిట్టాడుతుంటే దాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో సైతం పెట్టారు. రామచంద్రపురంలో మొక్కల రక్షణ కోసం వేసిన వలలో గురువారం కొండ చిలువ చిక్కుకోగా గ్రామస్తులు గమనించి దానిని హతమార్చారు.



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అకస్మాత్తుగా బదిలీ చేశారు

న్యాయం చేయాలని జేసీకి గ్రామ సర్వేయర్ల వినతి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ జిల్లాలోని 30 మంది గ్రామ సర్వేయర్లను ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండా అకస్మాత్తుగా కోనసీమ జిల్లాకు బదిలీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 20 మండలాల నుంచి 30 మంది గ్రామ సర్వేయర్లను ముందస్తు సమాచారం లేకుండా కోనసీమ జిల్లాకు బదిలీ చేశారన్నారు. చాలా మందికి కుటుంబ పరంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులున్నాయని తమ బదిలీలను పునః పరిశీలించాలని కోరారు.

కాకినాడ జిల్లా నుంచి 30మంది సర్వేయర్లను కోనసీమ జిల్లాకు బదిలీ చేసిన ఉత్తర్వులను పునః పరిశీలించాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు కోరారు.





కడియపులంకలో చిరుత సంచరిస్తున్నట్టు భావిస్తున్న ప్రాంతం (పైన) ట్రాప్ బోను (కింద)

కడియపులంకలోనే చిరుత

కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కడియం, సెప్టెంబరు 26: తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజలకు మూడు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి అడుగు జాడలను అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కడియపులంక, బుర్రిలంక, దోసాలమ్మ కాలనీ వద్ద గమనించిన అటవీ శాఖ అధికారులు ఎస్.భరణి, ప్రసాదరావు చిరుతపులి కడియపులంక ప్రాంతంలోనే ఉందని తెలిపారు. పులి కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రొఫెషనల్ హెల్పర్లతో కలిపి కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ డివిజన్లకు సంబంధించి అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ అధికారులు అంతా చిరుత పులిని పట్టుకునే పనిలోనే ఉన్నారు. పులి కదలికలను పరిశీలించేందుకు 20 కెమెరాలు, సోలార్‌తో పనిచేసే 4 సీసీ కెమెరాలు, 2 బోనులు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరంలో మరో ఆరు బోన్లు ఉన్నాయని, అవసరమైతే వాటిని కూడా తీసుకువచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం రాత్రి పులిని పట్టుకునేందుకు కడియపులంక చుట్టూ అటవీ శాఖ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత ఎవరూ బయట తిరగొద్దని, అవసరమనుకుంటే ముగ్గురు, నలుగురు కలిపి రావాలన్నారు. ఒకరోజు ఆలస్యమైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా పులిని బంధిస్తామని అటవీ శాఖ అధికారులు చెప్పారు.

పులిని పట్టుకునేందుకు
ముమ్మర ప్రయత్నాలు

డీఎఫ్‌వోలు భరణి, ప్రసాదరావు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ చిరుత పులి కొనసాగుతోంది. అది దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్టు నుంచి కడియం నర్సరీల్లోకి వెళ్లింది. దానిని పట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశాం. థర్మల్ డ్రోన్ సహాయంతో గమనిస్తున్నాం. కెమికల్ మొబిలైజేషన్ ద్వారా పట్టుకోవడానికి శిక్షణ పొందిన నిపుణులు కూడా వస్తున్నారు' అని తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఎఫ్‌వోలు ఎస్.భరణి, ప్రసాదరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భరణి మాట్లాడుతూ... చిరుత ఈనెల 19న దివాన్‌చెరువు ఆర్ఎఫ్‌లో చివరగా కనిపించిందని, ప్రస్తుతం కడియం నర్సరీల్లో దాని పాద ముద్రలు గుర్తించినట్టు తెలిపారు. వర్షాల వల్ల ఆ ముద్రలు ఎటువైపు ఉన్నాయనేది లభ్యం కాలేదన్నారు. ప్రస్తుతం ఏ నర్సరీలో ఉందో స్పష్టత ఉందని, 20 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, నర్సరీ అసోసియేషన్‌కు చెందిన సీసీ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. ట్రాప్ కేసు (బోను)లు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గోదావరి వరదల వల్లే ఇటు వచ్చి ఉంటుందని భావిస్తున్నామని, రిజర్వ్ ఫారెస్టులాగే సీతాఫలాల చెట్లు, నర్సరీలను కూడా అది నివాస ప్రాంతంగా భావిస్తుందన్నారు. కడియం ప్రాంతానికి కోనసీమ జిల్లా దగ్గరగా ఉండడం వల్ల ఆ ప్రాంతంలో కూడా అప్రమత్తం చేస్తున్నట్టు చెప్పారు. అది కచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందో గమనించి, ఆయా నర్సరీల వైపు ఎవరూ వెళ్లకుండా అప్రమత్తం చేసినట్టు చెప్పారు. కోనసీమ డీఎఫ్‌వో ప్రసాదరావు మాట్లాడుతూ తమ జిల్లా పరిధిలోని ఏడిద, మెర్నిపాలెంల్లో నర్సరీలు ఉన్నాయని, అక్కడ కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అది కుక్కలను తింటూ జీవిస్తోందన్నారు. చిరుత సంచరించే ప్రాంతాల్లో ప్రజలు బహిరంగ మల విసర్జన చేయవద్దని కోరారు. కడియపులంక సర్పంచ్ రాంజీ మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని వివరించారు.

బ్యాంకు కస్టమర్ పాయింట్‌లో రూ.15 లక్షలు స్వాహా

- ఏడాదిగా జరుగుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- డ్వాక్రా సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఇంటిగ్రా కంపెనీ అధికారులు
- లబోదిబోమంటున్న డ్వాక్రా మహిళలు

అంబాజీపేట, సెప్టెంబరు 26: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం... బ్యాంకు అధికారుల ఉదాసీనత... డ్వాక్రా యానిమేటర్ల ఇష్టారాజ్యం... డ్వాక్రా సంఘ సభ్యుల పాలిట శాపంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ పరిధిలో ఇంటిగ్రా కంపెనీ ద్వారా బ్యాంకింగ్ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్నారు. దీనిని నిర్వహిస్తున్న పరమట మణి డ్వాక్రా సభ్యులు చెల్లించిన రుణాలను బ్యాంకుకు గత ఏడాది నుంచీ చెల్లించట్లేదు. సుమారు రూ.15లక్షల మేర డ్వాక్రా సభ్యుల రుణాలు స్వాహా చేసినట్టు తెలిసింది. బ్యాంకు అధికారులకు అనుమానం రాకుండా డ్వాక్రా సంఘాలు చెల్లించిన రుణాన్ని ఒక నెల బ్యాంకుకు చెల్లించి మరో రెండు నెలలు స్వాహా చేసింది. ఈ వ్యవహారం ఏడాదిగా జరుగుతున్నా ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు, యానిమేటర్లు పట్టించుకోలేదు. బ్యాంకు అధికారులు యానిమేటర్లకు సూచించినా పట్టించుకోకపోవడంతో డ్వాక్రా సంఘాల సభ్యులు మోసపోయారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులు, యానిమేటర్ల తీరుపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పరిధిలోని 9 గ్రూపులకు సంబంధించి ఇప్పటివరకు రూ.15 లక్షలకుపైగా ఆ మహిళ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సిద్ధార్థ్ ద్వారా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకుకు డ్వాక్రా సంఘాలు రుణాలు ఎందుకు చెల్లించట్లేదన్న వివరాలు సేకరించారు. అప్పటికే తాము బీసీ పాయింట్ నిర్వహిస్తున్న పరమట మణి ద్వారా రుణాలు చెల్లించామని మేనేజరుకు తెలిపారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించారు. బ్యాంకు సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్న థర్డ్ పార్టీ ఇంటిగ్రా కంపెనీకి ఆ మేనేజరు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటిగ్రా కంపెనీ క్లస్టర్ హెడ్ రఘుచంద్రన్, సూపర్‌వైజర్ నరేష్ గ్రామంలో సంఘ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. వివరాల సేకరణ అనంతరం ఎంత మొత్తం స్వాహా జరిగిందో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

జాతీయ కరాటే పోటీలకు వైష్ణవి ఎంపిక



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26: కాకినాడలో ఈ నెల 22న జరిగిన కరాటే ఓపెన్ స్టేట్ టోర్నమెంటులో 65 కిలోల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల బీఎస్సీ సెకండియర్ విద్యార్థి ఎల్.వైష్ణవి గోల్డ్ మెడల్ సాధించింది. ఉత్తరాఖండ్‌లో నవంబరు 2,3 తేదీల్లో జరగబోయే జాతీయ పోటీలకు అర్హత సాధించిదని ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. వైష్ణవికి స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిశోర్‌బాబు, డీవీ రమణమూర్తి, బీహెచ్‌వీ మూర్తి, ఎంవీ నరసింహ అభినందనలు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రకాశ్‌బాబు

'కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలు చెప్పాలి'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకునే ముందు అందుకు కారణాలను అతడికి లేదా కుటుంబ సభ్యులకు కచ్చితంగా చెప్పాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ప్రీ-అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం-2012, ఆంధ్రప్రదేశ్ బాధితుల పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో తన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక పరిస్థితులు లేనిపక్షంలో డీఎల్ఎస్ఏ అందించే ఉచిత న్యాయ సేవలు, ఉచితంగా న్యాయవాదిని పొందే హక్కు వారికి ఉందని తెలియజేయాలన్నారు. నోటీసు, అరెస్టు, చార్జ్‌షీట్, విచారణ, రిమాండ్... ఇలా ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. బాధితులకు డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తున్న పరిహారంతో పాటు పలు చట్టాల గురించి వివరించారు. సదస్సులో పాడేరు అడిషనల్ ఎస్పీ జగదీశ్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో గాలిస్తున్న అధికారులు

దొరకని హరదీప్ ఆచూకీ

- ఐదు రోజులుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ఏఎన్ఎస్, డాగ్‌స్క్వాడ్‌లతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 26: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. మెడికో ఆచూకీ కోసం గత ఐదు రోజులుగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఏఎన్ఎస్ పార్టీలను రంగంలోకి దించారు. డాగ్‌స్క్వాడ్ సాయంతో పాములేరు వాగు పరివాహక ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గాలింపు చర్యలకు వర్షం అడ్డంకిగా మారింది. అయితే అధికారులు తలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు, పాములేరు వాగు నుంచి వాగు పరివాహక ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు నీటి ప్రవాహంలో గాలిస్తున్నాయి. వాగు వెంబడి ఉన్న దట్టమైన పొదలు, అటవీ ప్రాంతంలో ఏఎస్పీ జగదీష్ అడహళ్లి నేతృత్వంలో యాంటీ నక్సల్స్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ అణువణువునా జల్లెడపడుతున్నాయి. గురువారం చీకటి పడే వరకు ప్రయత్నించినప్పటికీ హరదీప్ ఆచూకీ లభించలేదు. దొరికే వరకు గాలింపు చర్యలు కొనసాగిస్తామని అధికారులు చెప్తున్నారు. మరోపక్క కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రవిప్రసన్న ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, సీఐ మురళీకృష్ణ సిబ్బంది పలు సూచనలు చేస్తూ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.38 లక్షలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 26: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 54 రోజులకు రూ.38,08,336 ఆదాయం వచ్చిందని దుర్గాభవాని తెలిపారు. లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, నాయకులు ముప్పనపల్లి గణేష్, పెంకె సాంబశివరావు, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, కర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 26: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఆయన పొగాకు రైతులతో సమీక్షించారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వచ్చే ఏడాది కూడా ఇలాగే ఉంటుందని రైతులు భావించవద్దన్నారు. ఈ ఏడాది ఏపీలో 170 మిలియన్ కిలోలు, కర్ణాటకలో 100 మిలియన్ కిలోల పరిమితిని బోర్డు ఇచ్చిందని, ఆ మేరకే రైతులు పంట సాగు చేయాలన్నారు. అధికంగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము ఉంటుందని హెచ్చరించారు. ఆమోదయోగ్యంగా లేని చౌడు నెలల్లో, బద్వాల్లోనూ పొగాకు పంట వేయవద్దని హెచ్చరించారు. గత ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందన్నారు. ఈ ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే, కెన్యా, ఆఫ్రికా దేశాల్లో పొగాకు సాగు ఎక్కువగా చేశారని, రైతులు తక్కువ సాగులో ఎక్కువ ఉత్పత్తి చేసే విధంగా చూసుకోవాలన్నారు. ఈ ఏడాది ఎస్ఎల్ఎస్ ఏరియాలో సరాసరి ధర కిలో రూ.326 ఉండగా నల్లరేగడి నేలలో సరాసరి ధర రూ.282 ఉందన్నారు. అనంతరం దేవరపల్లి శివారు పల్లంట్ల రోడ్డులో పొగాకు నారుమడులను చైర్మన్ పరిశీలించారు. నారుమడులకు తెగుళ్ల సోకకుండా తగు జాగ్రత్తలు, సూచనలు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి వెంకటశ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, కాట్రు సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, రైతులు సింహాద్రి ధర్మవతారం, యాగంటి సాయిబాబు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి
పదేళ్ల జైలు శిక్ష

సామర్లకోట, సెప్టెంబరు 26: మతి స్థిమితం లేని మహిళపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడిన చింతపల్లి నూకరాజుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు గురువారం తీర్పు చెప్పారు. ఎం.తరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు 202-2019, యూ-ఎస్ 376(2)(ఎం) ఐపీసీ పేరిట అప్పటి ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి నూకరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తదుపరి విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. రాజమహేంద్రవరం కోర్టులో ట్రయల్ జరగ్గా పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాది తరపున వాదన వినిపించా రు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి పై విధంగా శిక్ష విధించారని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ చెప్పారు.

భార్యను వేధించిన వ్యక్తికి
నాలుగేళ్ల జైలు

అన్నవరం, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో భార్యను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడినట్టు అన్నవరం ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కోటనందూరు మండలం బీబీ పట్నానికి చెందిన జిగిరెడ్డి అక్కన్నపాత్రుడు గిడజాం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని, అనంతరం వేధింపులకు గురిచేయడం, కులం పేరుతో దూషించడం వంటి చర్యలతో ఆమె 2022లో అన్నవరంలో కేసు పెట్టిందని ఆయన వివరించారు. కాగా జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత నిందితుడికి నాలుగేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధించారు.

ఇది ముంపు కాదట!

అధికారుల నిర్లక్ష్యంతో అందని పరిహారం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం మర్రిగూడెం గ్రామ ప్రథమ పౌరుడి ఇల్లు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఆ పంచాయతీ సర్పంచ్ సోడే రామయ్య ఇంట్లోకి నీరు చేరింది. ఆ గ్రామమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు ఉండగా అందులో దళితులే ఎక్కువ. వారి ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో అడవుల్లో తలదాచుకున్నారు. కానీ ఈ గ్రామం ముంపులో లేనట్టు అధికారులు చెప్పడంతో పరిహారం రాలేదు. దీంతో తమకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. సాక్షాత్తు సర్పంచ్ ఇల్లే నీట మునిగినా సచివాలయ అధికారులకు కనిపించలేదా అని విమర్శలొచ్చాయి. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ తగు చర్యలు తీసుకుని తమకు పరిహారం అందించాలని మర్రిగూడెం గ్రామస్తులు కోరారు. మండలంలోని భీమవరం గ్రామంతో పాటు పెద ఆర్కూర్, ఆబిచర్ల సచివాలయాల పరిధిలో కూడా పరిహారం రాలేదు. దీంతో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి స్పందించి అల్లూరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. వెంటనే వారికి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. - కూనవరం

ఇద్దరు ఆర్డీవోలు బదిలీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పెద్దాపురం ఆర్డీవో జే.సీతారామారావులను ప్రభుత్వం బదిలీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న వీరిని ఏ పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. వీరి స్థానంలో కాకినాడ ఆర్డీవోగా ఎస్.మల్లిబాబును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈయన్ని ఎన్నికల విభాగం నుంచి కాకినాడకు బదిలీ చేసింది. పెద్దాపురం ఆర్డీవోగా కె.శ్రీరమణిని నియమించింది. ఆమె జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తుండగా పెద్దాపురం బదిలీ చేశారు.

'మిల్లర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది'



కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26: గత నాలుగేళ్లలో రైస్ మిల్లర్లు చాలా సంక్షోభం ఎదుర్కొన్నారని, వారిని ఆదుకుని వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కాకినాడలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన వల్లూరి సూర్యప్రకాశరావు(సూరిబాబు) అభినందన సభ గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం మిల్లర్లకు సహాయపడుతుందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి సూరిబాబును రైస్ మిల్లర్లు శాలువాతో సత్కరించారు. కాకినాడ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి నాయుడు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మిల్లర్లు పాల్గొన్నారు.

'సెజ్ బాధిత రైతులకు అదనపు నష్టపరిహారం చెల్లించాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26: సెజ్ బాధిత ప్రతి రైతు కుటుంబానికి ఎకరాకు రెండు సెంట్లు నివాసయోగ్యమైన భూమిని కేటాయించాలని, రైతుల వద్ద తీసుకున్న భూమికి ఎకరాకు రూ.10లక్షలు అదనపు నష్టపరిహారం చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చంగల్‌రావు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సెజ్ బాధితులు గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను,కలెక్టర్ షాన్‌మోహన్‌కు కలిసి సమస్యలు వివరించారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు

తుని రూరల్, సెప్టెంబరు 26: జాతీయస్థాయిలో సీబీఎస్ఈ బోర్డు నిర్వహించిన యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. తమిళనాడు చెంగల్‌పేటలోని శ్రీగోకులం పబ్లిక్ స్కూల్లో జరిగిన సౌత్‌జోన్ యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమ సూర్యచరణ్, బి.సోహన్‌శ్రీ, సీహెచ్ జయదీప్, జి.చైతన్య అండర్-17 కేటగిరీ బాలుర గ్రూప్ యోగా విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. వీరిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ అభినందించారు.

అన్నవరం దేవస్థానంలో కల్తీ నెయ్యి అనుమానం: వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 26: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం సహా పలు అంశాల్లో జగన్ హయాంలోని టీటీడీ ట్రస్టు బోర్డులు కోట్లాది రూపాయిల అవినీతికి పాల్పడ్డాయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి గురువారం పూజలు నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ అన్నవరం దేవస్థానంలోనూ ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నెయ్యి సరఫరా టెండర్లు పిలవాల్సి ఉండగా రెండేళ్లుగా ఒక రినే ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. వర్మ వెంట టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, సకుమళ్ల గంగాధర్, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి: ఉమర్‌ఆలీషా

పిఠాపురం, సెప్టెంబరు 26: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు, రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

'రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులపై దృష్టిసారించాలి'

అన్నవరం, సెప్టెంబరు 26: అన్నవరం రైల్వేస్టేషన్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని, త్వరలో దీనికి సంబంధించి ఒక నివేదిక ఇవ్వాలని సికింద్రాబాద్ రైల్వే ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ అధికారిణి సుహాసిని ఎస్‌గోత్మరే అన్నవరం స్టేషన్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గురువారం ఆమె సత్యదేవుడి దర్శనానికి విచ్చేసి అనంతరం స్టేషన్‌ను పరిశీలించారు. ప్రయాణికులను సౌకర్యాలపై ఆరా తీశారు. రైల్వే క్యాంటీన్‌ను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రత ఉండాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరెంటెండెంట్ సతీష్‌కుమార్ జీఆర్‌పీ హెచ్‌సి శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి: కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట, సెప్టెంబరు 26: విద్యార్థుల్లో విద్యతోపాటు అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని, ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య అన్నారు. స్వచ్ఛతాహీ సేవాకార్యక్రమాల్లో భాగంగా పట్టణ పరిధిలో నాలుగు మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో చెత్తనుంచి సంపద తయారీలో భాగంగా యూజ్‌ఫుల్ ప్రొడక్ట్స్ పేరిట రూపొందించిన వివిధ ఆకృతుల ప్రదర్శన అయోధ్యరామపురం మున్సిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీవో

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26: కాకినాడ రూరల్ సర్పవరం ఆటోనగర్ ముంపు ప్రాంతాన్ని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ది కాకినాడ ఆటో బాడీ బిల్డర్స్, ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మేజర్ డ్రైన్ లేకపోవడం, డ్రైనేజీ శిథిలావస్థకు చేరడం, గట్టు జారిపోవడంతో ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరద నీరు నేరుగా ఆటోనగర్‌కు వస్తోందన్నారు. డ్రైనేజీల్లో పూడికతీత తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, డ్రైనేజీ డిపార్టుమెంట్ శాఖల సంయుక్తంగా కార్యాచరణ రూపొందించేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో కిషోర్ కార్మికులకు హామీ ఇచ్చారు.

కాకినాడ జిల్లా సర్వేశాఖ ఏడీ బదిలీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్సు ఏడీ లక్ష్మీనారాయణను రాజమండ్రి బదిలీ చేశారు. ఆయన రాజమండ్రి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీగా నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కట్టా శ్రీనివాస్‌ను ఇక్కడ నియమించారు.



ముంపు బెడద శాశ్వతంగా నివారించేందుకు కృషి: ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 26: సామర్లకోట పట్టణానికి సుదీర్ఘ కాలంగా సమస్యగా ఉన్న వరదనీటి ముంపు బెడదను శాశ్వతంగా నివారించేందుకు తాను కృషి చేస్తానని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. పూడిక తీత పనులు వృథా పేరిట ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పట్టణంలోని స్టేషన్‌సెంటర్, మఠంసెంటర్ ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ సెంటర్లో ప్రధాన కాలువలో పూడికతతీత పనులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే చినరాజప్ప విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వరుసగా కురుస్తున్న భారీవర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపు బెడదను ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టి శాశ్వతంగా ముంపు బెడదను నివారించాలని తాను మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చానన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య వివరిస్తూ మఠం సెంటర్ వద్ద డ్రైన్‌పై ఏర్పాటుచేసిన స్లాబ్‌ను మెషీన్ సాయంతో తొలగించి అడుగున ఉన్న పూడిక అవరోధాలను తొలగించి నెంబరు-2 మార్కెట్ మీదుగా ప్రధాన డ్రైన్‌లో వరదనీరు వేగంగా తరలివెళ్లే అవకాశాలు ఏర్పడుతాయన్నారు.


సామర్లకోటలోని కాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. గురువారం 30, 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి ఎమ్మార్వో కార్యాలయం వెనుక శ్రీవినాయక ఆలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి ఏసుబాబు, హెల్తాఫీసర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, సంగిశెట్టి అశోక్, బచ్చు శేఖర్, నల్లూరి శ్రీనివాస్, దంగేటి సతీష్, మల్లాడి గంగాధరం, ఎస్‌కే రహీమ్, సాయిబాబు పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, సెప్టెంబరు 26: పేదలకు సంక్షేమం, అభివృద్ధిని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించి మంచిప్రభుత్వం ఇది అని ప్రజలతో అనిపించుకుందని టీడీపీ నేత పూడా వెంకటరామకృష్ణ అన్నారు. గురువారం పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సాధనాల వెంకట శివరామకృష్ణ, జనిపల్లి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం, సెప్టెంబరు 26: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంతోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని 25వవార్డులో గురువారం నిర్వహించిన ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో జనసేన జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి ఆయన పాల్గొన్నారు. తహశీల్దార్ వెంకటలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కూటమి నేతలు రాజాసూరిబాబురాజు, కాకినాడ రామారావు పాల్గొన్నారు.

'అవినీతి, అక్రమాలు లేని అభివృద్ధి'

శంఖవరం, సెప్టెంబరు26: అవినీతి, అక్రమాలు జరగకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే సీఎం చంద్రబాబు వల్లే సాధ్యపడుతుందని టీడీపీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండపం గ్రామంలో నిర్వహించారు. పోలం చిన్నా పర్వత సురేష్, బద్దిరామారావు, ఉల్లి వీరభద్రరావు, వెన్నాశివ, కీర్తి వెంకటేష్, జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, బొమ్మిడి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పరిమితి లేదు: ఎమ్మెల్యే దివ్య

తొండంగి, సెప్టెంబరు 26: ప్రజా సేవకు పరిమితి లేదని తుని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. గురువారం శృంగవృక్షం, అద్దరిపేట, యల్లయ్యపేట, గొల్ల ముసలయ్యపేటల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ నేతలు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, కొయ్యా రామకేశవ, కోడ వెంకటరమణ పాల్గొన్నారు. గొల్లముసలయ్యపేటలో ప్రజావేదికలో ఎమ్మెల్యే దివ్యను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.


గొల్ల ముసలయ్యపేటలో దివ్యను సన్మానిస్తున్న దృశ్యం

సంక్షోభంలోను ప్రజాసంక్షేమం: అనంతలక్ష్మి

గురజానాపల్లి(కరప), సెప్టెంబరు 26: గత వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినా కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పాటుపడుతోందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు గురజానాపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో అన్నారు.

ఆరుగురు వాహనదారులకు జైలు శిక్ష

కాకినాడ క్రైం, సెప్టెంబరు 26: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురు వాహనదారులకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 12 మంది మద్యంతాగి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారించామని ట్రాఫిక్-1, 2 సీఐలు రమేష్, రామారావు తెలిపారు. వీరిని 3వస్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి నరసింహారావు వీరిలో ఆరుగురుకి తలో 2రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మిగతా ఆరుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

సిలికాన్, జెర్మేనియంలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి

జేఎన్టీయూకే, సెప్టెంబరు 26: మెటీరియల్స్ రంగంలో సిలికాన్, జెర్మేనియంలు రెండూ ప్రపంచాన్ని శాసిస్తున్నాయని జేఎన్టీయూకే రెక్టార్ ప్రొఫెసర్ కేవీ రమణ తెలిపారు. వర్సిటీలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ సెమినార్ హాల్లో ఆ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ ఇన్‌మెటీరియల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెసస్ అనే అంశంపై మూడురోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. రెక్టార్ కేవీ రమణ ముఖ్యఅతిథిగాను, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు గౌరవఅతిథులుగా, రిసోర్స్‌పర్సన్‌గా డాక్టర్ ఎస్.సాయికుమార్ పాల్గొనగా డాక్టర్ డి.లింగరాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ విజయప్రసాద్, డాక్టర్ కళ్యాణ్ మనోహర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రెక్టార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని అధ్యాపకులకు, రీసెర్చ్ స్కాలర్లకు, విద్యార్థులకు ఉపయోగపడేలా ఇటువంటి వర్క్‌షాప్‌లను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 15 అంగన్‌వాడీ పోస్టులకు అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.జ్యోతి తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. 13వ వార్డు సంజయ్‌నగర్-2(ఓసీ కేటగిరీలో సహాయకురాలు పోస్టు), 12వ వార్డు పర్లోపేట-2(ఓసీ), 43వ వార్డు ఎస్.అచ్యుతాపురం-1(బీసీ-డీ), 14వ వార్డు ఏటిమొగ-6(ఓసీ), 13వ వార్డు సాంబమూర్తినగర్-2(బీసీ-డీ), 31వ వార్డు రాగంపేట-2(ఓసీ), 25వ వార్డు తారకరామనగర్-1(ఓసీ), 1వవార్డు రమణయ్యపేట-4(బీసీ-డీ), 38వవార్డు ఎల్విన్‌పేట-2(ఎస్సీ), 2వవార్డు వలసపాకల(బీసీ-డీ), 30వ వార్డు తిలక్ స్ట్రీట్(ఓసీ), 34వ వార్డు సుభాస్ స్ట్రీట్(బీసీ-ఈ) అంగన్‌వాడీవర్కర్ పోస్టులకు మహిళా అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. 2024, జూలై 1 నాటికి 21ఏళ్లు నిండి 35ఏళ్ల లోపు ఉన్నవారే అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 5లోగా కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేసి రశీదు పొందాలని తెలిపారు. వివరాలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం లేదా ఆయా సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్లను సంప్రదించాలని తెలిపారు.

బాలికా రక్షణపై మండలస్థాయి పోటీలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26: బాలికా రక్షణపై ప్రత్తిపాడు మండల స్థాయిలో జడ్పీ హైస్కూల్‌లో గురువారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మండలంలోని హైస్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా విజేతలకు ఎంఈవో వి.రాజబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో జె.నాగమ్మ, ధర్మవరం శ్రీ ప్రతిభా విద్యాలయానికి చెందిన కె.నగ్మ, వక్తృత్వ పోటీల్లో ఎం.సాయిప్రవల్లిక, చిత్రలేఖనం పోటీల్లో ప్రత్తిపాడు జడ్పీ స్కూల్ విద్యార్థిశివప్రసాద్ ప్రథమ బహుమతులు సాధించగా ద్వితీయ బహుమతులను బి.వెంకటసత్య, ఎం.భవాని, సత్యదుర్గ, వి.ప్రసన్నకుమార్ సాధించారు. బహుమతి ప్రదానంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణ, రాచపల్లి హెచ్‌ఎం మిరియాల రాజబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా కుమారి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26: కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా ఎస్ఎల్ఎన్ కుమారి గురువారం సర్పవరం జంక్షన్‌లోని మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె పిఠాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమెను రెవెన్యూ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పిఠాపురం తహసీల్దారుగా గోపాలకృష్ణ

పిఠాపురం, సెప్టెంబరు 26: పిఠాపురం తహసీల్దారుగా పీవీవీ గోపాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కరప తహసీల్దారుగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కుమారి కాకినాడ రూరల్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గోపాలకృష్ణకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

కరప తహశీల్దార్‌గా నందిపాటి

కరప, సెప్టెంబరు 26: కరప తహశీల్దార్‌గా నందిపాటి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై కరప రాగా ఇక్కడ పనిచేస్తున్న గోపాలకృష్ణ పిఠాపురం బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరరావు, రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26: కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్ సోమాదుల గోవిందు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే వనమాడి కొండబాబును గురువారం ఆయన నివాసంలో కలిశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోండి: యనమల

తుని రూరల్, సెప్టెంబరు 26: అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన హైవేను ఆనుకుని నడుస్తున్న ఆయిల్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ఆదేశించామన్నారు.


గొల్లప్రోలులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న అరుంధతీయపేట వాసులు

చంద్రబాబు, పవన్ ఫొటోలకు పాలాభిషేకం

గొల్లప్రోలు, సెప్టెంబరు 26: వరద ముంపునకు గురైన తమకు తక్షణం సహాయం అందేలా చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు గొల్లప్రోలు అరుంధతీయపేట వాసులు కృతజ్ఞతలు తెలిపారు. గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంవద్ద గురువారం వారు జనసేన నాయకులతో కలిసి బాబు, పవన్ ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ కాలనీవద్ద కాలనీవాసులు చంద్రబాబు, ఎస్వీఎస్ఎన్ వర్మ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గొల్లప్రోలు పట్టణంలో తామున్నామని అధికారులకు, ప్రభుత్వానికి గుర్తు చేసిన వర్మకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'అసైన్డ్ భూమిని అమ్ముకునేలా హక్కు కల్పించండి'

కోటనందూరు, సెప్టెంబరు 26: పెద్దాపురం డివిజన్‌లో 6,500 ఎకరాలు అసైన్డ్ భూమిని అమ్ముకునే హక్కును కల్పించాలని పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామరావు ఆదేశించారు. కోటనందూరులో గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వీర్వోలు, సర్వేయర్‌లతో సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూముల్లో తప్పులు ఉంటే సరిదిద్దేందుకు తగు చర్యలు చేపట్టామని, అందులోభాగంగా కోటనందూరు మండలంలో 124 ఎకరాల్లో 171మంది రైతులకు 22ఏ నుంచి తొలగించాలని, ఇందులో లోపాలు లేకుండా చేస్తున్నామని తెలిపారు. తహశీల్దార్ సుబాష్, వీర్వోలు పాల్గొన్నారు.

3 నుంచి భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు

పెద్దాపురం, సెప్టెంబరు 26: వర్షులవారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకూ శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీఠాధిపతి చింతా గోపీశర్మ తెలిపారు. ఈ మహోత్సవాల నిర్వహణకు సంబంధించి ఈనెల 28న రాట ముహూర్తం నిర్వహిస్తామన్నారు.

30న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

పెద్దాపురం, సెప్టెంబరు 26: సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్, రెగ్యులర్ చేయాలన్న డిమాండ్లతో ఈనెల 30న దేశవ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో పంపిణీ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, వడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలేరు వరద బాధితులను ఆదుకోవాలి: వంగా గీత

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 26: ఏలేరు వరదల వల్ల నష్టపోయిన రైతులు, రైతుకూలీలు, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వంగా గీత విశ్వనాథ్ కోరారు. గురువారం ఆమె కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల వల్ల మూడు మండలాలు, రెండు పట్టణాల పరిధిలో తీవ్రం నష్టం జరిగిందన్నారు. రైతులకు పరిహారంతోపాటు క్రాప్ ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు.

సచివాలయం వద్ద వరద బాధితుల ఆందోళన

గొల్లప్రోలు, సెప్టెంబరు 26: గొల్లప్రోలు పట్టణం కొత్తపేటలోని ఆరో వార్డు సచివాలయంవద్ద వరద ముంపు బాధితులు గురువారం ఆందోళన నిర్వహించారు. మలిరెడ్డి ఉమాంబ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాలు ముంపునకు గురైనా తమకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసహాయం అందలేదన్నారు.

చెందుర్తిలో అక్రమ కబేళాపై పోలీసుల దాడి

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 26: గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు పుష్కర కాలువ గట్టు వెంబడి నిర్వహిస్తున్న అక్రమ పశుకబేళాపై అడిషనల్ ఎస్ఐ లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 120 కిలోల పశుమాంసాన్ని, రెండు మోటార్‌సైకిళ్లు, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు

» సివిల్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26: నిరుపేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి తెలిపారు. గురువారం ఒకటో డివిజన్ రమణయ్యపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరక్కుండా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. సక్రమంగా పంపిణీ జరిగేలా పర్యవేక్షణ చేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ప్రజలతో మమేకం అయ్యేలా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంతం నానాజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో ప్రాయశ్చిత దీక్ష


కిర్లంపూడి మండలం చిల్లంగిలో దీక్ష చేస్తున్న తుమ్మలపల్లి

కిర్లంపూడి, సెప్టెంబరు 26: తిరుమల లడ్డూ ప్రసాదంలో అపవిత్రకు నిరసనగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ దీక్ష చేపట్టారు. మండలంలోని చిల్లంగిలో భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆయన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ హిందువుల మనోభావాలు దెబ్బతీసినందుకు కఠినంగా శిక్షించాలన్నారు. ఉలిసి అయిరాజు, మాదారపు వీరబాబు, గంధం ప్రభాకరరావు, ఎల్లపు దొరబాబు, కాకిలేటి బాబ్జి, బొండా రమణ, నందిబాబు, కల్కి భగవాన్ ఉన్నారు.

తునిలో..

తుని రూరల్, సెప్టెంబరు 26: తునిలో జనసేన శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడినుంచి పాదయాత్రగా పాత బజార్ వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చారు. జనసేన కార్యదర్శి బుల్లెట్ వాసు, శ్రీనివాసరాజు, బోనం చినబాబు, బొప్పన రాము, అద్దేపల్లి బాలాజీ, టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి సోమరాజు ఉన్నారు.

పిఠాపురంలో దివ్యాంగుల దీక్ష


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీ ఉదయ్, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి

పిఠాపురం, సెప్టెంబరు 20: వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించడం ద్వారా వైసీపీ నేతలు తిరుమలను అపవిత్రం చేశారని ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో గురువారం దివ్యాంగులు దీక్ష చేపట్టారు. వీరి దీక్షకు ఎంపీ తంగెళ్ల, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ తిరుమల జరిగిన ఈ ఘటనతో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు.

జగ్గంపేటలో సుందరకాండ పారాయణం

జగ్గంపేట, సెప్టెంబరు 26: సర్వీస్ రోడ్‌లోని కొత్త కొండబాబుశ్రీ కాంప్లెక్స్ ఆవరణలో తిరుపతి లడ్డూ అపవిత్రమైన కారణంగా జగ్గంపేట ఆర్యవైశ్య మహిళా మండలి, ఇతిరాజ్ మండలి ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం నిర్వహించి 68 సర్గలు పఠనం చేసి స్వామికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కొత్తచంద్రిక, అప్పన రజని, బొండాడ సౌమ్య, కొత్త సాయిలక్ష్మి, బొండా సుభద్ర, దారా శ్రీలక్ష్మి, కొత్తసుభాషిని, కొత్త రజిని, మాతంశెట్టి లావణ్య జగ్గంపేట ఆర్యవైశ్య మహిళా మండలి, యతిరాజ్ మండలి, వాసవి మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26: ఈనెల 27వతేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ తూరంగి ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ కాకినాడ డివిజన్ ఏఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అందువల్ల తూరంగి ఫీడర్ పరిధిలోని రవీంద్రనగర్, గాంధీ ఎన్‌క్లేవ్, గాయత్రి స్కూల్ రోడ్, ఖాదీ భాండార్ రోడ్, కోటిపల్లి రోడ్, భాస్కర గార్డెన్స్ సూర్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట, సెప్టెంబరు 26: సామర్లకోట పట్టణ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ లో వివిధ ఫీడర్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలనుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఇంజనీరు ప్రభాకర్ గురువారం తెలిపారు. సామర్లకోట పట్టణమంతా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళల ఉపాధికి సంఘాల అభివృద్ధి

ఏలేశ్వరం, సెప్టెంబరు 26: మహిళలు స్వయం ఉపాధిపై సాధికారత దిశగా ఎదగడం కోసం సంఘాలను అభివృద్ధి చేస్తున్నామని మెప్మా టీఎంసీ గళ్ల సాయి కుమార్ అన్నారు. పట్టణ పేద నిర్మూలన సంస్థ మెప్మా సంఘాల ఆధ్వర్యంలో బుట్టలు, దుస్తులు, తినుబండారాలు, వివిధ చేతివృత్తి స్టాళ్లను గురువారం ఏర్పాటు చేశారు. వీటిని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి,అలమండ చలమయ్య సందర్శించారు.

సర్పవరం భావనారాయణస్వామి ఈవోగా లక్ష్మీనారాయణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26: సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా గ్రేడ్-1 ఎం.లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురముళ్ల భద్రకాళీ వీరేశ్వర స్వామి దేవస్థానంనుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.